క్లుప్తంగా

ట్రినిటిలో నియోఫెస్ట్



విద్యార్థులతో అధ్యాపకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు శనివారం నియోఫెస్ట్ పేరిట ఫ్రెషర్స్ వేడుకలు నిర్వహించారు. బందంపల్లిలోని స్వరూపగార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే సాధించలేనిది ఏమీ ఉండదన్నారు. ప్రస్తుత పోటీ వాతావరణంలో ప్రతిభా నైపుణ్యాలు చూపిన వారికే ఉద్యోగావకాశాలు అందుతాయన్నారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ మణిగణేశ్, సురేశ్, రాజిరెడ్డి, బాపిరెడ్డి, నటరాజన్, ప్రభాకర్, స్వాతి, పద్మిని, ఆంజనేయులు, వంశీకృష్ణ పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో సినిమా టాకీస్



హోమం నిర్వహిస్తున్న హాల్ డైరెక్టర్లు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని మార్కండేయ కాలనీలో శ్రీరామ సినిమా టాకీస్‌ను శనివారం ప్రారంభించారు. సినిమా హాల్ డైరెక్టర్లు హోమం నిర్వహించి సినిమాను ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

సాంబ శివాలయంలో అన్నపూజ



సుల్తానాబాద్: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఉన్న శ్రీసాంబశివ ఆలయంలో స్వామివారికి అన్నపూజ కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. ఈ కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ పూజల అనంతరం తీర్థప్రసాదాలను పూజారి రమేశ్ అందజేశారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బండి రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



దొడ్డ బాలాజీని సన్మానిస్తున్న గ్రామస్తులు

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లిలో నిర్మిస్తున్న రామాలయానికి శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ రూ.10వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు బాలాజీకి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు

అంగన్‌వాడీ కేంద్రంలో సమీక్ష సమావేశం



సమావేశమైన సూపర్‌వైజర్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామ ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం మండల సూపర్‌వైజర్ అంజలి అంగన్‌వాడీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో చిన్నారులకు అందించే ఆహార సమాచారంతో పాటు వయసుకు తగిన పౌష్టికాహారం అందిస్తున్నారా అని ఆరా తీశారు. ముఖ్యంగా ప్రతి నెలా చిన్నారులకు అందించే పాలు, గుడ్లు, అదేవిధంగా గర్భిణులకు అందించే పప్పులు, నూనె, కోడిగుడ్లు సకాలంలో అందించాలని ఆదేశించారు. కాగా కేంద్రాల వారీగా ప్రీస్కూల్ పిల్లలు, గర్భిణులు, బాలింతలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల అంగన్‌వాడీ టీచర్స్ అధ్యక్షురాలు కృష్ణకుమారి, ఆదర్శ (మోడల్) కేంద్రం నిర్వాహకురాలు పెండ్యాల విమలమ్మ, మండల పరిధిలోని 24 కేంద్రాల నిర్వాహకులు హాజరయ్యారు. ౖ.

ప్రకృతికి పచ్చతోరణం



కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ నుంచి సుల్తానాబాద్ వైపు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా దశాబ్దాల కిందట అప్పటి ఎంపీపీ ఈద శంకర్‌రెడ్డి నాటిన మొక్కలు మహా వృక్షాలుగా ఎదిగి ప్రయాణికులను ఆహ్లాద పరుస్తున్నాయి. ఈ రహదారి గుండా ప్రయాణించే వారికి ఈ వృక్షాలు పచ్చదనంతో స్వాగతం పలుకుతుననట్లుగా ఆకుపచ్చని స్వాగత తోరణంలా ప్రకృతి ప్రేమికులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. ఎంతో మంది ఈచెట్ల నీడన వన భోజనాలు చేస్తున్నారు.

పక్షుల కోసం వరిగొలుసు



కాల్వశ్రీరాంపూర్: పక్షుల ఆహారం కోసం వృద్ధ దంపతులు వరి గొలుసులు కడుతున్నారు. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన కలవేన లక్ష్మి-రాయనర్సు దంపతులు వరికోతకు వచ్చిన సమయంలో నాణ్యత ఉన్న వరి గొలుసులు కట్టలుగా కట్టి ఓ తీగకు కడుతున్నారు. బాగా ఎండబెట్టిన వరి గొలుసులు ఎలుకలు కొట్టకుండా ఓ ఇనుప పెట్టెలో దాచి పెడతారు. పక్షులు తిన్న కొద్దీ ఈ తీగలకు వేలాడదీస్తామని వారు పేర్కొంటున్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదాతను అభినందిస్తున్న శంకర్

కోల్‌సిటీ: రక్తదానం చేయడం యువత సామాజిక బాధ్యత అని జాతీయ యువజన అవార్డు గ్రహీత, రామగుండం యువమిత్ర సేవాసమితి అధ్యక్షుడు ఈదునూరి శంకర్ పిలుపునిచ్చారు. శనివారం రక్తహీనతతో బాధపడుతున్న స్థానిక ఎల్బీనగర్‌కు చెందిన ఓ మహిళకు, గోదావరిఖని జీజీహెచ్ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్ కేంద్రంలో స్థానిక గాంధీనగర్‌కు చెందిన ఎండీ.షఫీతాజ్ అనే యువకుడు స్వచ్ఛందంగా రక్తదానం చేశాడు. ఈ సందర్భంగా రక్తదాతను ఈదునూరి శంకర్‌తోపాటు మిత్ర నాయకులు గాండ్ల అశోక్, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ సంపత్, రమ్యకృష్ణ అభినందించారు.

అరగంటకో ఆర్టీసీ బస్సు



జగిత్యాల బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

- పెద్దపల్లి-జగిత్యాల మధ్య నడిచేలా ఏర్పాట్లు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి-జగిత్యాల జిల్లాల ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా ఆర్టీసీ అధికారులు ప్రతి అరగంటకో బస్సు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో ఈ రెండు జిల్లాల నడుమ రాకపోకలు సాగించే ప్రయాణికుల ఇబ్బందులు తొలగాయి. పెద్దపల్లి నుంచి ధర్మారం మీదుగా జగిత్యాలకు బస్సులు నడుపుతుండడంతో ఈ ప్రాంత ప్రయాణికులకు దూరభారం తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతోంది.

రైలు ప్రయాణిలకు మేలు..

జిల్లా కేంద్రంగా అవతరించిన పెద్దపల్లిలోని రైల్వేస్టేషన్‌లో ఇటీవల పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకున్నారు. పెద్దపల్లి నుంచి తిరుపతి, వారణాసి, షిరిడీ తదితర పుణ్యక్షేత్రాలకు వెళ్లే వారంతా పెద్దపల్లి రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణించే అవకాశం ఏర్పడింది. జగిత్యాల జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు దూరభారం లేకుండా, తక్కువ చార్జీలతోనే పెద్దపల్లి



ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

రైల్వేస్టేషన్‌కు చేరుకునేందుకు వీలు కలిగిందని పలువురు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ గ్రామాల మీదుగా ప్రయాణం..

పెద్దపల్లి నుంచి బయల్దేరిన బస్సు ధర్మారం మండలం దొంగతుర్తి, నందిమేడారం, ధర్మారం, చిల్వకోడూరు మీదుగా జగిత్యాలకు చేరుకుంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. అయితే మధ్యలో ఓ బస్సును ధర్మపురి మీదుగా నడిపితే పెద్దపల్లి ప్రాంత ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ఆర్టీసీ అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సీఎం అల్పాహారంపై సంతృప్తి

- ఆరు రోజులు ఆరు వెరైటీలతో అల్పాహారం
- తగ్గిన విద్యార్థుల గైర్హాజరు శాతం

రామగుండం: సీఎం కేసీఆర్ 2023 అక్టోబర్ ఆరో తేదీన ప్రాథమిక పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సీఎం అల్పాహార పథకం సత్ఫలితాలు ఇస్తోంది. నియోజకవర్గ పరిధిలో ఒక ప్రాథమిక పాఠశాలలో పైలట్ ప్రాజెక్టుగా సీఎం అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా రామగుండం నియోజకవర్గంలో పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి నిరుపేద విద్యార్థులు ఉదయం పాఠశాలలో పౌష్టికాహారం భుజిస్తున్నారు. ఆరు రోజులు ఆరు వెరైటీలతో అల్పాహారం అందించడంతో విద్యార్థుల్లో హర్షం వ్యక్తమవుతోంది.



పాఠశాలలో అల్పాహారం తింటున్న విద్యార్థులు (ఫైల్)

నాన్న లేడు.. అమ్మ కూలీ



మా నాన్న చిన్నప్పుడే చనిపోయాడు. అమ్మ హోటల్‌లో పని చేసుకుంటూ మమ్మల్ని పోషిస్తోంది. నేను, నాకు ఒక అక్క ఉంది. గతంలో ఉదయం ఖాళీ కడుపుతో ఏం తినకుండా బడికి వచ్చేటోడిని. ఇప్పుడు అల్పాహారంతో కడుపునిండా తింటున్న. – మోహన్, 5వ తరగతి, ముబారక్‌నగర్

రోజూ అల్పాహారం



బడి ఉన్న రోజు ఇక్కడ అల్పాహారం తింటున్నాం. సెలవు రోజుల్లో ఇంట్లో తినడానికి ఏమీ లేకపోవడంతో ఆకలితో కడుపు మాడుతోంది. మా బంధువులు కూడా ఇదే స్కూలులో చదువుతామంటున్నారు. మా సార్లు అల్పాహారం తప్పకుండా తినాలని చెప్తున్నారు.

– పల్లపు అఖిల్, 1వ తరగతి, ఎస్టీ కాలనీ

కడుపు నిండా తింటున్నా



మానాన్న కూలీ పనికి వెళ్లే ముందు బడి సమయానికి అన్నం వండితే కొంచెం తిని వచ్చేదాన్ని. బడి సమయానికి అన్నం వండకుంటే ఖాళీ కడుపుతో వచ్చేస్తాం. ఇప్పుడు అల్పాహారం తింటే కడుపు నిండుతోంది. బడికి సెలవులు రావద్దనిపిస్తోంది.

– వర్షిక, 3వ తరగతి, విద్యుత్‌నగర్

తొందరగా బడికి..



గతంలో ఉదయం ఏం తినకుండా బడికి బ్యాగు పట్టుకొని రావాలంటే బరువుగా కష్టంగా అనిపించేది. ఇప్పుడు తొందరగా బడికి వచ్చి అల్పాహారం తినాలనిపిస్తోంది. – హజ్రా, 4వతరగతి, సుభాష్‌నగర్

ఆరు రోజులు.. ఆరు వెరైటీలు



వారంలో ఆరు రోజుల్లో ఆరు వెరైటీల అల్పాహారం పెడుతున్నాం. సోమవారం ఇడ్లీ-సాంబారు, మంగళవారం పూరీ, ఆకు కుర్మా, బుధవారం ఉప్మా, సాంబారు, గురువారం చిరుధాన్యాల ఇడ్లీ, సాంబారు, శుక్రవారం ఉగ్గాని, అటుకులు, శనివారం పొంగల్, సాంబారుతో అల్పాహారం అందిస్తున్నాం. ఎక్కువగా నిరుపేద పిల్లలు ఉండడంతో సంతోషంగా కడుపు నిండా తింటుంటే ఆనందంగా ఉంది. కడుపు నిండడంతో చదువుపై ఏకాగ్రతతో చదువుతున్నారు. గైర్హాజరుశాతం గణనీయంగా తగ్గింది.

– ఆకుల మనోహర్‌రావు, హెచ్‌ఎం, ఎంపీపీఎస్

‘సేఫ్ ఆన్ రోడ్’పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్: వాహనాల్లో వెళ్లేటప్పుడు ప్రమాదాల నివారణకు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని శ్రీచైతన్య పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రాజీవ్ రహదారిపై విద్యార్థులు రోడ్డు ప్రమాదాల నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారిపై హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వాహనదారులకు గులాబీ పువ్వులు అందించి హెల్మెట్ ధరించాలని కోరారు. ప్రిన్సిపాల్ మమత మాట్లాడుతూ పిల్లలకు ప్రతి విషయంపై అవగాహన కల్పించడానికి ఇలాంటి స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని, అందుకే సేఫ్ ఆన్ రోడ్ అవగాహన ర్యాలీ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం రాజు, అకడమిక్ డీన్ సతీశ్, ప్రైమరీ ఇన్‌చార్జి రాధిక, ప్రి ప్రైమరీ ఇన్‌చార్జి మానస, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

ఆదివరాహస్వామి ఆలయంలో ‘గంగుల’



రామగిరి: మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఆదివరాహస్వామి ఆలయాన్ని శనివారం బీఆర్‌ఎస్ కరీంనగర్ అభ్యర్థి గంగుల కమలాకర్ దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

ఖాజిపల్లిలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ఖాజిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సరళి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహో పారిజాతం, ఏఎన్‌ఎం విమల, ఆశావర్కర్ అరుణకుమారి పాల్గొన్నారు.

కిష్టయ్యకు నివాళి

గోదావరిఖని: తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన పోలీస్ కిష్టయ్య 14వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. నగరంలోని స్థానిక చౌరస్తాలో కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దబ్బెట శంకర్, గైక్వాడ్ రజనీకాంత్, పూర్మ శ్రీనివాస్, పిడుగు కృష్ణ, తూడి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ముదిరాజ్ నాయకులు





వెచ్చని నేస్తాలు

కోల్‌సిటీ: వాతావరణంలో మార్పులు చేటు చేసుకుంటున్నాయి. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. చలి పెరుగుతోంది. చలికాలంలో ఉన్ని దుస్తులు వెచ్చని నేస్తాలు. చలికి ‘స్వెటర్’ వేస్తే వణుకు తగ్గుతుంది. పెరుగుతున్న చలి నుంచి రక్షణ పొందేందుకు ఉలాన్(ఉన్ని) దుస్తుల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లాలోని గోదావరిఖనితోపాటు పెద్దపల్లి తదితర ముఖ్య ప్రాంతాల్లో ఉన్ని దుస్తుల అమ్మకాలకు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్‌లో ఇండో టిబెటియన్, కర్నాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఢిల్లీ, అరుణాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల వ్యాపారులు చేతితో, యంత్రాలతో తయారుచేసిన ఉన్ని ఉత్పత్తులు, స్వెటర్లు, జర్కిన్లు, రగ్గులు, శాలువాలు, చిన్నపిల్లలకు మంకీ క్యాప్‌లు, గ్లౌజులు, టోపీలు, నోస్ మాస్కులు, స్కార్ఫ్‌లు, చెవులకు కట్టుకునే ఊలు వస్త్రాలు విక్రయిస్తున్నారు. ఫ్యాషన్ ట్రెండ్‌ను అనుసరిస్తూ యువత, మహిళలు, పిల్లల కోసం వెరైటీ డిజైన్ల ఉన్ని వస్త్రాలను అమ్ముతున్నారు.

లెవల్ క్రాసింగ్ గేట్ మరమ్మతుతో ఇబ్బంది

ఓదెల: కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలో పొత్కపల్లి లెవల్ క్రాసింగ్ గేట్ వద్ద మరమ్మతు పనులు చేపట్టడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. శనివారం మరమ్మతు పనులు చేపట్టడంతో సుల్తానాబాద్ నుంచి జమ్మికుంటకు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ప్రయివేట్ వాహనాలు రెండోగేట్ మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తోంది. పొత్కపల్లి, గొల్లపల్లి గ్రామస్తులు నానా తిప్పలు పడుతున్నారు. రైల్వే సిబ్బంది ఎలాంటి ప్రమాదాలు జరగకుండా గేట్ వద్ద మరమ్మతు పనులు చేపడుతోంది. పనులు త్వరగా పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం అందజేత



సాయం అందిస్తున్న మాజీ జెడ్పీటీసీ, సేవా సమితి సభ్యులు

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన ముత్యం శంకరమ్మకు శనివారం రామగిరి సేవా సమితి ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన శంకరమ్మ మెదడులో రక్తం గడ్డకట్టి హైదారాబాద్ సుపత్రిలో చికిత్స పొందుతోంది. వైద్యఖర్చుల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు మాజీ జెడ్పీటీసీ గంట వెంకట రమణారెడ్డి, సేవా సమితి సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. సేవాసమితి సభ్యులు కాట రాజేందర్‌గౌడ్, రాచకొండ శంకర్, అనవేని శ్రీనివాస్, కన్నూరి శ్రీనివాస్, మామిడి హరీశ్, కాట శంకర్ గౌడ్, పడాల మొగిళిగౌడ్, బనుక అంజి తదితరులు పాల్గొన్నారు.